ప్రజాశక్తి

శుక్రవారం 5 మే 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

అద్దె కట్టరు.. ఖాళీ చేయరు..!

- సిఐఎస్ఎఫ్ ఆధీనంలోనే నేటికీ ప్రహ్లాద కళ్యాణ మండపం
- సింహాచలం దేవస్థానానికి రూ.17.82 కోట్లు నష్టం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : 'ఇన్‌కమ్ ఫుల్.. కలెక్షన్ నిల్' అన్న చందంగా సింహాచలం దేవస్థానానికి చెందిన ప్రహ్లాద ప్రార్థనా మందిరం పరిస్థితి మారింది. విశాఖ నగరం నడిబొడ్డున జగదాంబ జంక్షన్ నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే రోడ్డులో ఉన్న ఈ మందిరం ఏళ్ల తరబడి సిఐఎస్ఎఫ్ ఆధీనంలో ఉంది. అయితే వాళ్లు అద్దె చెల్లించడం లేదు. అలాగని ఖాళీ చేయడం లేదు. దీంతో ఏం చేయాలో తెలియక దేవస్థానం అధికారులు తలలు పట్టుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. సుమారు నాలుగున్నర దశాబ్దాల కిందట సింహాచలం దేవస్థానం ట్రస్టీ, కాంగ్రెస్ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు కీర్తిశేషులు ద్రోణంరాజు సత్యనారాయణ చొరవతో జగదాంబ జంక్షన్‌కు కూతవేటు దూరంలో జిల్లా గ్రంథాలయ సంస్థను ఆనుకుని సుమారు ఎకరం స్థలంలో 'ప్రహ్లాద ప్రార్థనా మందిరం' పేరుతో కళ్యాణ మండపం నిర్మించారు. సింహాచలం దేవస్థానానికి చెందిన స్థలంలో దేవస్థానం నిధులతో గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్‌తో దీని నిర్మాణం పూర్తి చేశారు. తద్వారా దేవస్థానానికి ఏటా రూ.1.62 కోట్లు ఆదాయం వచ్చేది. వివాహాది శుభ కార్యాలకు, వివిధ వస్త్ర ఎగ్జిబిషన్లకు ఎంతగానో ఉపయోగపడిన ఈ కళ్యాణ మండపం నేడు సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్) కబంధ హస్తాల్లో చిక్కుకుంది. 2012 నుంచి నేటి వరకు అంటే సుమారు 11 ఏళ్ల పాటు సిఐఎస్ఎఫ్ అధీనంలోనే ఈ కళ్యాణ మండపం ఉంది. నేటి వరకూ అద్దె రూపంలో సుమారు రూ.17.82 కోట్లు సింహాచలం దేవస్థానానికి రావాల్సి ఉన్నా చెల్లించడం లేదు. ఖాళీ చేయమంటే చేయడం లేదు. ఎవరైనా ఇంటి అద్దె రెండు నెలలు బకాయి ఉంటే యజమాని తక్షణం ఖాళీ చేసి పొమ్మంటాడు. వినకపోతే బలవంతంగా ఖాళీ చేయిస్తాడు. అటువంటిది దాదాపు 11 ఏళ్ల పాటు అద్దె చెల్లించకుండా సిఐఎస్ఎఫ్ దళాలు దౌర్జన్యంగా మిగతా 2లో..



సిఐఎస్ఎఫ్ ఆధీనంలో ఉన్న ప్రహ్లాద కళ్యాణ మండపం

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై

శ్వేతపత్రం విడుదల చేసే దమ్ముందా ?

వైసిపి ప్రభుత్వానికి టిడిపి మాజీ మంత్రి గంటా సవాల్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేసే దమ్ము వైసిపి ప్రభుత్వానికి ఉందా ? అని టిడిపి మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సవాలు విసిరారు. డిఫెన్స్‌కీ, సివిల్‌కీ తేడా తెలియని వ్యక్తి సిఎంగా ఉన్నారని జగన్‌ను ఎద్దేవా చేశారు. గురువారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల తర్వాత రాజకీయ లబ్ధి కోసం జగన్ శంకుస్థాపనల పర్వానికి తెరతీశార్నారు. ప్రతిపక్షంలో జగన్ మాట్లాడిన మాటలకూ, అధికారంలోకి వచ్చిన తరువాత ఆడిన మాటలకూ పొంతన లేదని అన్నారు. ఊసరవెల్లి కూడా జగన్‌లా రంగులు మార్చలేదన్నారు. పెట్టుబడుల సదస్సు జరిగి రెండు నెలలైందని, ఇప్పటి వరకూ సమీక్ష కూడా నిర్వహించలేని పరిస్థితిలో వైసిపి ప్రభుత్వం ఉందని అన్నారు. రాష్ట్రంలో రామోజీరావు, ఆదిరెడ్డిలే చిట్‌ఫండ్ కంపెనీలు నడుపుతున్నారా ? ఇంకెవ్వరూ నడపడం లేదా ? అని ప్రశ్నించారు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే వారిద్దరి కంపెనీలపై దాడులు నిర్వహిస్తున్నారని తెలిపారు. జగన్ ప్రభుత్వానికి కౌంట్ డౌన్ స్టార్టయ్యిందన్నారు. డ్రగ్స్‌కు నిలయంగా రాష్ట్రం మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ సిఎం జగన్ సైకోలా తయారయ్యారన్నారు. హెలికాప్టర్‌లో వెళ్లే సిఎం కోసం వంద కిలోమీటర్ల రూట్ బ్లాక్ చేశారని మండిపడ్డారు. యువతకు ఉపాధి కరువై గంజాయి రవాణా చేసే పరిస్థితి రాష్ట్రంలో వచ్చిందన్నారు. ప్రభుత్వ వేధింపుల వల్ల పరిశ్రమలు తరలిపోతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిగతా 2లో..



మాట్లాడుతున్న మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు

ఫిషింగ్ హార్బర్‌లో అదనపు వసతులు కల్పించాలి

▸ వార్త 2లో..

ప్రతి కుటుంబానికీ సంక్షేమం

▸ వార్త 8లో..

జిఒ 7 అమలుకు ధర్నా

▸ వార్త 4లో..



పోలీసులు స్వాధీనం చేసుకున్న క్యాబేజీ బుట్టలు, గంజాయి

క్యాబేజీ మాటున

గంజాయి అక్రమ రవాణా

పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు వార్త 3లో..

స్టీల్‌ప్లాంట్‌పై వైసిపి వైఖరి మారాలి

- కేంద్రంతో లాలూచీ తగదు
- సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ విషయంలో వైసిపి ప్రభుత్వ వైఖరి మారాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. గురువారం ఉదయం మద్దిలపాలెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ బుధవారం భోగాపురం ఎయిర్‌పోర్టుకు, అదానీ వైజాగ్ టెక్ పార్కుకు శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వైజాగ్ టెక్ పార్కు ద్వారా భవిష్యత్తులో 50,425 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని ప్రకటించారని అన్నారు. ఉపాధి వస్తే అందరూ హర్షిస్తారని, కానీ ఇప్పటికే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లక్ష మందికి ఉపాధి. కల్పిస్తున్న స్టీల్ ప్లాంట్‌ను అమ్మకానికి పెడితే జగన్ సర్కారు ఎందుకు నిలువరించడం లేదని ప్రశ్నించారు. సొంత గనులు, ముడిసరుకు, వర్కింగ్ క్యాపిటల్, రైల్వేరేక్స్ ఇవ్వకుండా మోడీ ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను అష్ట దిగ్బంధనం చేస్తుంటే ఎందుకు అడ్డుకోవడం లేదన్నారు. సెప్టెంబరు నుంచి విశాఖలోనే మకాం పెట్టి ఉత్తరాంధ్రను అభివృద్ధి చేస్తామంటున్నారని, స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ సంస్థలు లేకుండా ఎలా అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. ఉక్కు కర్మాగారం కోసం సర్వం త్యాగం చేసిన మిగతా 2లో..



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

మొదటి పేజీ తరువాయి..

అద్దె కట్టరు.. ఖాళీ చేయరు..!

కొనసాగుతుంటే పాలకులకుగానీ, దేవస్థానానికిగానీ చీమ కుట్టినట్లుగా కూడా లేదు.

గతంలో అలా.. నేడు ఇలా..

గతంలో నగరంలోని సామాన్యులకు కూడా ఈ కల్యాణ మండపం అద్దె అందుబాటులో ఉండేది. వివాహాలు, తదితర శుభకార్యాలు నిత్యం జరిగేవి. అలాగే రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, విద్యాసంస్థల సభలు నిర్వహించేవారు. తద్వారా ఏటా అప్పన్న ఆలయానికి రూ.1.62 కోట్ల ఆదాయం వచ్చేది. 2012లో అప్పటి కలెక్టర్ తీసుకున్న నిర్ణయంతో ప్రహ్లాద ప్రార్ధనా మందిరం సిఐఎస్ఎఫ్ చేతుల్లోకి వెళ్ళింది. అనేక కర్మాగారాలలో విధులు నిర్వహిస్తూ నగరంలోని పాత బస్టాండ్ ప్రాంతంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో అప్పటి వరకు తలదాచుకున్న సిఐఎస్ఎఫ్ దళాలు పూర్తిగా ఈ భవనాన్ని ఆక్రమించుకున్నాయి. ఎటువంటి అనుమతులూ లేకుండానే భవనంలో ఇష్టానుసారంగా మార్పులు, చేర్పులు చేపట్టారు. సిఐఎస్ఎఫ్ దౌర్జన్యాలు ఎలా ఉన్నాయంటే ఇప్పుడు సింహాచలం దేవస్థానం సిబ్బందినిగానీ, అధికారులనుగానీ ఈ మండపంలోకి రానివ్వడం లేదు. నాలుగేళ్ల క్రితం దేవస్థానం సిబ్బంది ఈ మందిరంలోకి వెళ్లి పరిస్థితులను తెలుసుకోవాలని ప్రయత్నించారు. వారిని లోపలికి వెళ్లకుండా సిఐఎస్ఎఫ్ సిబ్బంది నిరోధించారు. దీంతో పోలీసులను ఆశ్రయించి దేవస్థానం సిబ్బంది లోపలికి ప్రవేశించి కొలతలు తీసుకున్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ స్థలం కూడా..

కేవలం ప్రహ్లాద ప్రార్ధనా మందిరాన్ని మాత్రమే కాకుండా.. దీనిని ఆనుకుని ఉన్న జిల్లా గ్రంథాలయ సంస్థ ఖాళీ స్థలం కూడా సిఐఎస్ఎఫ్ కబంధ హస్తాల్లోనే చిక్కుకుంది. సుమారు ఎకరం విస్తీర్ణంగల ఇక్కడ ఈ స్థలం చుట్టూ రేకులతో రక్షణ ఏర్పాటు చేసి అందులో వాహనాల పార్కింగ్, ఇతర అవసరాలకు ఉపయోగిస్తున్నారు. అందుకుగానూ జిల్లా గ్రంథాలయ సంస్థకు ఒక్క రూపాయి కూడా అద్దె చెల్లించడం లేదు. ఎనిమిదేళ్ల నుంచీ గ్రంథాలయ సంస్థ స్థలం సిఐఎస్ఎఫ్ అధీనంలోనే ఉంది. గ్రంథాలయ సంస్థ స్థలానికి ఈ దుర్గతి రావడానికి మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు కారకులనే ఆరోపణలున్నాయి. గ్రంథాలయ సంస్థ స్థలాన్ని స్వాధీనం చేసుకొని, ఆ స్థలంలో సుమారు రూ.2 కోట్లతో బహుళ అంతస్తులతో గ్రంథాలయ సంస్థ భవనాన్ని నిర్మిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి ఏడాది క్రితం ఈ స్థలాన్ని సందర్శించిన సందర్భంలో చెప్పారు. ఆ తర్వాత పట్టించుకోలేదు. స్థలం మాత్రం సిఐఎస్ఎఫ్ ఆధీనంలోనే ఉంది. అటు ప్రహ్లాద కల్యాణమండపం, ఇటు జిల్లా గ్రంథాలయ సంస్థ స్థలాలను ఆధీనంలో ఉంచుకున్న సిఐఎస్ఎఫ్ సిబ్బంది నేడు ఎవరనీ లోపలకు అనుమతించడం లేదు.

స్టీల్‌ప్లాంట్‌పై వైసిపి వైఖరి మారాలి

ఉక్కు నిర్వాసితుల ఉపాధి గురించి జగన్ పట్టించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ వైజాగ్ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని ఆపాలని తీర్మానం చేసి చేతులు దులుపుకుంటే సరిపోతోదన్నారు. కేంద్రమంటే భయపడటం తగదన్నారు. బిజెపితో కుమ్మక్కై రాష్ట్ర ప్రయోజనాలకు భంగకరంగా మారడం హేయమన్నారు. 'మీరు పోట్లాడరు.. పోరాడే ప్రజలను మాత్రం అరెస్టు చేయిస్తారు. రాత్రి వరకూ పోలీసు స్టేషన్లలో నిర్బంధిస్తారు. కేసులు పెడతారు. ఇది ఎంత వరకూ న్యాయం' అని ప్రశ్నించారు. నేను పోరాటం చేయను.. ఎవర్నీ పోరాటం చేయనివ్వనని సందేశం ఇవ్వదలిచారా ? అని ప్రశ్నించారు. అధికారం ఉందికదా అని ప్రజలపై నిర్బంధం ప్రయోగిస్తే గత ప్రభుత్వాలకు పట్టిన గతే జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానికీ పట్టకతప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా వైసిపి ప్రభుత్వ వైఖరి మారాలని, చిత్తశుద్ధితో కేంద్రంతో పోరాడి స్టీల్‌ప్లాంట్ అమ్మకం ఆపించాలని అన్నారు. పూర్తి ఉత్పత్తి సామర్ధ్యంతో ప్లాంట్ నడిచే విధంగా కేంద్రాన్ని ఒప్పించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలనూ ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రం మెడలు వంచాలన్నారు. ఆంధ్ర రాష్ట్ర ఎంపీలతో పాటు ఇతర రాష్ట్రాల ఎంపీల సహాయం తీసుకొని పార్లమెంట్‌ను స్తంభింపచేసే కృషి చేయాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వి.కృష్ణారావు పాల్గొన్నారు.

శ్వేతపత్రం విడుదల చేసే దమ్ముందా ?

ఎమ్‌డి.నజీర్, ఉత్తర నియోజకవర్గం ఇన్‌ఛార్జి చిక్కాల విజయబాబు, భీమిలి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు పాల్గొన్నారు.



దాసరి చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న సంఘం సభ్యులు

ఘనంగా దాసరి జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉత్తరాంధ్ర సినీ దర్శకుల సంక్షేమ సంఘం అధ్యక్షులు రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ దాసరి నారాయణరావు 76వ జయంతి వేడుకలను గురువారం ఉషోదయ జంక్షన్‌లోగల వైజాగ్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ అండ్ స్టూడియోలో నిర్వహించారు. స్థానిక రంగస్థల, సినీ కళాకారులు పాల్గొని దాసరికి నివాళ్లర్పించారు. సంఘం అధ్యక్షులు రాకేష్ రెడ్డి, కార్యదర్శి కారెం వినయ్ ప్రకాష్, రంగసాయి నాటక గ్రంథాలయం వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్‌లో అదనపు వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఫిషింగ్ హార్బర్‌లో అదనపు వసతులు కల్పించాలని ఎపి మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ డిమాండ్ చేశారు. ఫిషింగ్ హార్బర్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులు అస్తవ్యస్తంగా ఉండటం, జిల్లా మత్స్యశాఖ అధికారి నియంత ధోరణితో వ్యవహరించడం వల్ల మత్స్యకారులకు కలుగుతున్న ఇబ్బందులపై గురువారం అసోసియేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి కోసం తయారుచేసిన డిపిఆర్‌లో మత్స్యకారుల అవసరాలను పరిగణలోకి తీసుకోలేదన్నారు. కనీసం ప్రజాభిప్రాయ సేకరణ కూడా జరగకుండా తయారుచేసిన ముసాయిదా వల్ల ఫిషింగ్ హార్బర్ బోటు యజమానులకు, మత్స్యకారులకు ప్రయోజనం తక్కువగా ఉంటుందన్నారు. స్థలాభావం వల్ల అనేక సమస్యలతో ఉన్న స్థానిక మత్స్య పరిశ్రమకు అవసరమైన నాలుగు అదనపు ఫింగర్ జెట్టీలను కాంక్రీట్‌తో నిర్మించకుండా ఫ్లోటింగ్ జెట్టీలుగా నిర్మించి బలవంతంగా మత్స్యకారులకు అంటగట్టడానికి చూస్తున్నారని ఆరోపించారు. హుదూద్, సునామీలాంటి ప్రకృతి విపత్తులను ఫిషింగ్ హార్బర్ తట్టుకొని నిలబడాలంటే కచ్చితంగా కాంక్రీట్ జెట్టీలు నిర్మించాల్సిన అవసరముందన్నారు. ఈ నేపథ్యంలో డిపిఆర్‌లో మార్పులు చేయాలని కోరారు. జిల్లా మత్స్యశాఖ అధికారి నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తున్నారన్నారు. మత్స్యకారులకు కనీస సమాచారం ఇవ్వకుండా ఫిషింగ్ హార్బర్‌లో రోడ్లను తవ్వించేసి, వ్యవస్థను స్తంభింప చేసిన వైనంపై ప్రశ్నిస్తే నియంతలా దుర్భషలాడారని తెలిపారు. మత్స్యకారులకు, బోటు యజమానులకు కనీస గౌరవం ఇవ్వడం లేదన్నారు. జిల్లా కలెక్టర్ పూర్తి స్థాయి విచారణ జరిపి సంబంధిత అధికారిని బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మైలిపిల్లి లక్ష్మణరావు, కోశాధికారి మైలిపిల్లి నరసింహులు, డాల్ఫిన్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్.వీరన్న, బర్రి కొండబాబు పాల్గొన్నారు.

అద్దె వాహనాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖకు వచ్చే ప్రయాణికులు, పర్యాటకులు, ప్రజలు అద్దె వాహనాల సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైల్వే డివిజనల్ మేనేజర్ అనూప్ కుమార్ సత్పతి కోరారు. రైల్వేస్టేషన్ కంప్యూటర్ రిజర్వేషన్ కౌంటర్ ఆవరణలో రాధాకృష్ణ ఎంటర్ ప్రైజెస్ ఏర్పాటు చేసిన బైక్, కార్ రెంటల్స్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కార్లు, బైకులను రోజువారీ అద్దె ప్రాతిపదికన అందించడం అభినందనీయమన్నారు. రైల్వే శాఖకు ఆదాయాన్ని పెంచే క్రమంలో వాల్తేర్ డివిజన్ పలు నూతన వాణిజ్య కార్యకలాపాలను ప్రోత్సాహిస్తోందని తెలిపారు. ఈ క్రమంలోనే ఇఎస్ఆర్‌కె బైక్ రెంటల్స్ ఏర్పాటు చేసామని ఆయన అన్నారు. సంస్థ అధినేత నాయుడు మాట్లాడుతూ రోజుకి బైక్‌కు రూ.500, కారుకు రూ.2,500 వంతున అద్దె నిర్ణయించామని, రెండోసారి వచ్చే వినియోగదారుని పది శాతం రాయితీ ఇస్తామని తెలిపారు. తమ వద్ద ప్రస్తుతం వివిధ మోడళ్లలో



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిఆర్ఎం అనూప్ సత్పతి

95 ద్విచక్ర వాహనాలు, 20 కార్లు అందుబాటులో ఉన్నాయని. తమ కార్యాలయం అన్ని వేళలా అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు. వాహనం కావాల్సిన వినియోగదారులు ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తమకు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు.

పిచ్చుకల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అంతరించిపోతున్న పిచ్చుకల సంతతిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. గురువారం ఆమె జివిఎంసి ప్రధాన కార్యాలయంలో గ్రీన్ క్లైమేట్ స్వచ్ఛంద సంస్థ, జివిఎంసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'పిచ్చుకల సంతతి పెరగడానికి కృషి చేద్దాం' అన్న కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మట్టి పిచ్చుక గూడులను, మట్టి పాత్రలను పలువురికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిచ్చుకల సంఖ్య తగ్గుతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. వేసవి కాలంలో పక్షులు, ఇతర జీవుల కోసం చిరు ధాన్యాలను, మంచి నీటిని అందరూ అందుబాటులో ఉంచాలన్నారు. పిచ్చుకలతో పంటలకు ఎలాంటి ప్రయోజనం చేకూరుతుందో వివరించారు. కార్యక్రమంలో టీం ప్రతినిధి జెవి.రత్నం, జివిఎంసి కార్యనిర్వహణాధికారి స్వరాజ్యలక్ష్మి, పి.పద్మజ పాల్గొన్నారు.

మహారాజశ్రీ అనకాపల్లి 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 242 / 2022

బిట్వీన్:
గొంపా క్రిష్ణమూర్తి . . . వాది
అండ్:
చేవా నాగమణి . . . ప్రతివాది
టు:
చేవా నాగమణి, W/o. వీర్రాజు,
హిందూ, డో.నెం. 10-72/టి2,
దుర్గానగర్, వేపగుంట,
విశాఖపట్నం జిల్లా.

పై నెంబరు దావాలో మీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు **తే:11-5-2023దికి** వాయిదా వేసియున్నారు. కావున ఆరోజు **ఉదయం 10-30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేక మీ తరపున లాయరు గారు గాని పైకోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమందు పై దావా తీర్మానించబడును.

ఎం.వి.ఆర్.భూపతిరావు
ఎల్.వి.రమణ,
డి.శివప్రసాద్
అడ్వకేట్, విజయనగరం

మహారాజశ్రీ అనకాపల్లి 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.280 / 2022 O.S. 242 / 2022

బిట్వీన్:
గొంపా క్రిష్ణమూర్తి . . . పిటీషనర్
అండ్:
చేవా నాగమణి . . . రెస్పాండెంట్
టు:
చేవా నాగమణి, W/o. వీర్రాజు,
హిందూ, డో.నెం. 10-72/టి2,
దుర్గానగర్, వేపగుంట,
విశాఖపట్నం జిల్లా.

పై నెంబరు ఐ.ఎ.లో మీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు **తే:11-5-2023దికి** వాయిదా వేసియున్నారు. కావున ఆరోజు **ఉదయం 10-30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేక మీ తరపున లాయరు గారు గాని పైకోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమందు పై పిటిషన్ తీర్మానించబడును.

ఎం.వి.ఆర్.భూపతిరావు
ఎల్.వి.రమణ,
డి.శివప్రసాద్
అడ్వకేట్, విజయనగరం

IN THE HON'BLE COURT OF THE VI ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
I.A. 147/2021 in O.S.252/2021

Between :
Munagapaka Varalakshmi .....Petitioner/Plaintiff
And:
Tagarampudi Uma Maheswari & 4 others ....Repondents/Defendants

NOTICE

To,
R-1/D-1: Tagarampudi Uma Maheswari, W/o.T. Kotibabu, Hindu, aged 52 years, Female, R/at D.No.6-26/3, Flat No.F1, Devi Sri Narasimha Residency, Situated at Bagaramma Temple area, Adavivaram, Visakhapatnam.
R-2/D-2: Tagarampudi Uday Kiran, S/o.T. Kotibabu,Hindu, aged 30 years, Male, Rest-do-
R-3/D-3: Kolajapu Eswar Rao, S/o.not known to the plaintiff, Hindu, aged 77 years, Male, Rest-do-
R-4/D-4: Kolajapu Ammaji, W/o. Eswar Rao, Hindu, aged 72 years, Female, Rest-do-

Whereas the above petitioner had filed the above petition I.A.147/2021 in O.S.252/2021 against you for the reliefs mentioned therein. whereas, it is found to the satisfaction of Hon'ble Court that you have been evading consistently, the receipt of summons/notice in the above proceedings. Hence the Hon'ble Court was pleased to direct substituted service of summons by way of paper publication.

Take notice that in the above proceeding you are hereby directed to appear before the Hon'ble VI Addl. Senior Civil Judge Court, at Visakhapatnam on **09-05-2023 at 10:30 A.M** either in person or through an Advocate, failing which the hearing will take place in your absence.

YNS LAW CHAMBERS
Y.N. SRINIVAS & Y. SRI LAKSHMI
Advocates
Visakhapatnam, **Cell: 9849664495**

చెరుకు రసం.. ఎంతో మధురం...

వేసవిలో ఉపశమనం

ప్రజాశక్తి -భీమునిపట్నం : చెరుకు రసం ఎంతో మధురంగా ఉండడమే గాకుండా, వేసవిలో ఉపశమనం కలుగుతుందనే చెప్పాలి. చెరకు తక్షణ శక్తి వనరు అని చెప్పొచ్చు. వాతావరణం వేడిగా ఉన్నప్పుడు గ్లాసు చెరుకు రసం తాగితే ఆరోగ్యానికి చాలా మంచిదని పలువురు ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కేవలం రూ.10కే లభించే చెరుకు రసం తాగితే కాలేయ పని తీరును మెరుగుపరుస్తుంది. అంతే మూత్ర పిండాల ఆరోగ్యాన్ని కాపాడు కోవడంలో సహాయ పడుతుంది. సహజంగా ఇందులో కొలెస్ట్రాల్ తక్కువగా ఉంటుంది. కేన్సర్‌తో పోరాడేందుకు సహాయ పడుతుంది. మొటిమలు, నోటి దుర్వాసనను నయం చేయడానికి చెరుకు రసంలోని పోషకాలు ఉపయోగపడతాయి. చర్మ సంబంధిత సమస్యలు నయమవుతాయి. చెరుకు రసంలో గ్లైకోలిక్, ఆల్ఫా హైడ్రాక్సీ వంటి ఆమ్లాలు అధికంగా ఉంటాయి. కణాల ఉత్పత్తిని పెంచుతుంది. జీర్ణ సమస్యను తగ్గిస్తుంది. చెరుకు రసంలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది' అని నిపుణులు చెబుతున్నారు. రొమ్ము కేన్సర్‌తో బాధ పడే వారికి ఖచ్చితంగా చెరుకు రసం అవసరమని పేర్కొంటున్నారు.

టన్ను చెరుకు రూ.8 వేలు

విజయనగరం జిల్లా బొబ్బిలి, విశాఖ జిల్లా పద్మ నాభం ప్రాంతాల నుంచి టన్ను చెరుకును రూ.8వేలుకు కొని తెస్తున్నామని చెరుకు రసం తయారీదారులు చెబుతున్నారు. చెరుకు రసం తయారు చేసే మిషన్ రూ.8 వేలు అని వివరించారు. ఏటా వేసవిలో పార్వతీపురం నుంచి భీమిలి వచ్చి చెరుకు రసం అమ్ముతుంటామని వ్యాపారి వివరించారు.



చెరుకు రసం తయారుచేస్తున్న వ్యాపారి

నేరాలు ఘోరాలు

క్యాబేజీ మాటున గంజాయి అక్రమ రవాణా

ప్రజాశక్తి-పెందుర్తి : గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిని పెందుర్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒడిశా నుంచి క్యాబేజీ బుట్టల మాటున బొలెరో వాహనంలో గంజాయిని తరలిస్తున్నారు. పెందుర్తి మండలం సరిపల్లి సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా బొలెరో వాహనంలో 14 బస్తాల గంజాయి లభించింది. గంజాయితో పాటు బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని విచారిస్తున్నారు.

మహిళ అదృశ్యం

ప్రజాశక్తి- పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఒప్పంగి వెంకటలక్ష్మి (35) ఈ నెల 2వ తేదీ నుంచి కనిపించడం లేదని ఆమె భర్త సూర్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ రోజు సాయంత్రం నాలుగు గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వెంకటలక్ష్మి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. సిఐ గొలగాని అప్పారావు కేసు నమోదు చేసి హెడ్ కానిస్టేబుల్ ఎం.ప్రకాష్ బాబుకు దర్యాప్తు బాధ్యతలను అప్పగించారు. ఆచూకీ తెలిసినవారు పెందుర్తి పోలీసులను సంప్రదించాలని ప్రకాష్ కోరారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక పోలీస్ స్టేషన్ పరిధి వంటిల్లు జంక్షన్‌లో 60 సంవత్సరాల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. వ్యక్తిని గుర్తించగలిగిన వారు గాజువాక పోలీస్‌స్టేషన్ సంప్రదించాలని పోలీసులు కోరారు.


పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఆడారి ఆనంద్ కుమార్

ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి- ములగాడ : జీవీఎంసీ 59వ వార్డు పరిధి వాయుపుత్రకాలనీ, నక్కవాని పాలెం సచివాలయం పరిధిలో అర్హులైన పేదలు 240 మందికి వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీసురేష్ ఆధ్వర్యాన ఇళ్ల పట్టాలను పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు తప్పనిసరిగా అందుతాయని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు కలిదిండి బద్రీనాథ్, వార్డు ఇన్‌ఛార్జి రేవాళ్ల సత్యనారాయణ, నాయకులు నమ్మి శ్రీను, పిలక రామ్మోహనరావు, సచివాలయ అడ్మిన్‌లు సుధీర్, సుదీప్తి, సచివాలయ కన్వీనర్లు కుంచారావు, భూపతి, ఎదురు సత్యనారాయణ, సరోజ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ, ఆర్‌బికె భవనాల ప్రారంభం

ప్రజాశక్తి-పెందుర్తి: మండలంలోని వాలిమెరక గ్రామ పంచాయతీలో రూ.62.15 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాలను ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు అని పేర్కొన్నారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేసి నేరుగా ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భగవాన్ జయరాం, జెడ్పీటీసీ ఉప్పిలిదేవీకనకరాజు, ఎంపీపీ నాగమణిఅంజి, సర్పంచ్ బొడ్డు చంద్ర వాణిప్రకాష్, ఎంపీటీసీ సభ్యులు స్వప్న, నక్క కనకరాజు, బిఎస్.రాజు, కేసాబోయిన త్రినాథ్, నాగార్జున, మాధవరావు, ఎంపిడిఒ వెంకటరమణ, అధికారులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.


సచివాలయ, ఆర్‌బికె భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజు

రేపు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరానగర్ విద్యుత్ ఫీడర్ నిర్వహణ, చెట్లు నరికివేతలో భాగంగా ఈ నెల 6వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని జోన్ -3 ఎపిఇపిడిసిఎల్ ఏఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఇందిరానగర్, రాజీవ్‌నగర్, ఆదర్శనగర్, రవీంద్రనగర్, బిఎన్‌ఆర్‌నగర్, తోటగరువు, హనుమంతువాక కొండ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఘనంగా స్వర్ణ పుష్పార్చన

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచల దేవస్థానంలో ఆర్జిత సేవలో భాగంగా గురువారం స్వర్ణపుష్పార్చన కార్యక్రమాన్ని అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను అర్చకులు అందించారు.

డోలా పున్నమికి గట్టి భద్రత

ప్రజాశక్తి-సింహాచలం: రెండో విడత చందన సమర్పణ కోసం డోలా పూర్ణిమి రోజున దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. గత ఏడాది వరాహ పుష్కరిణిలో జరిగిన దుర్ఘటన నేపథ్యంలో దేవస్థానం అధికారుల గట్టి పోలీసు భద్రత ఏర్పాటుచేస్తున్నారు. 100 మంది కానిస్టేబుళ్లతోపాటు సిఐలు, ఎస్‌ఐలను వినియోగిస్తున్నారు. భద్రత ఏర్పాట్లను జెసిపి ఎ.నరసింహారావు పర్యవేక్షిస్తున్నారు. పుష్కరణి వద్ద గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు.


ఫుట్‌బాల్ క్రీడాకారులతో లతీఫ్ తదితరులు

ఇండో నేపాల్ ఫుట్‌బాల్ పోటీలకు 16 మంది

ప్రజాశక్తి-సీతమ్మధార : ఇండో నేపాల్ రంగస్థలం ఇంటర్నేషనల్ స్టేడియంలో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు జరిగే ఫుట్‌బాల్ ఛాంపియన్ ట్రోఫీకి ఆంధ్రప్రదేశ్ నుంచి 16 మంది క్రీడాకారులు వెళ్తున్నట్లు ప్రెసిడెంట్ లతీఫ్ తెలిపారు.

ఉపాధిని దెబ్బతీస్తే సహించం

తహశీల్దార్ కార్యాలయం ఎదుట క్వారీ కార్మికుల ధర్నా


ధర్నా నుద్దేశించి మాట్లాడుతున్న మూర్తి

ప్రజాశక్తి -భీమునిపట్నం : దాదాపు 40ఏళ్ల పైబడి మండలంలోని దాకమర్రి ఎర్ర క్వారీ వద్ద రాళ్లు కొట్టుకుని బతుకుతున్న తమ ఉపాధిని జగనన్న ఇళ్ల స్థలాల పేరుతో దెబ్బ తీయొద్దని క్వారీ కార్మికులు గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. క్వారీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన జరిగిన ధర్నానుద్దేశించి యూనియన్ అధ్యక్షులు ఆర్ఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ, రేఖవానిపాలెం పంచాయతీకి చెందిన 83 మందికి ఎర్రక్వారీ వద్ద ఇళ్ల స్థలాలు కేటాయించడంలో అర్థం లేదన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్న చిత్త శుద్ధి ఉంటే అదే పంచాయతీలో పదుల ఎకరాల్లో ఉన్న ప్రభుత్వ భూమిని కేటాయించాలని కోరారు. ప్రమాద కరమైన క్వారీ వద్ద ఇళ్ల స్థలాలు ఇవ్వడమంటే లబ్ధిదారుల ప్రాణాలతో ఆడుకున్నట్లేనని ఆందోళన వ్యక్తంచేశారు. సిఐటియు భీమిలి జోన్ కార్యదర్శి రవ్వ నరసింగరావు మాట్లాడుతూ, సుమారు 16 ఎకరాల విస్తీర్ణం గల ఎర్ర క్వారీ వద్ద 40 ఏళ్లుగా దాదాపు వంద మంది కార్మికులు పనిచేస్తున్నారని, క్వారీయే జీవనాధారంగా బతుకుతున్నారని వివరించారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి వ్యతిరేకం కాదని, అనువైన చోట ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్వారీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) కార్యదర్శి ముద్దాడ రాము, క్వారీ కార్మికులు తోటయ్య, రామారావు, నాయుడు, దేముడు, అప్పలస్వామి తది తరులు పాల్గొన్నారు. అనంతరం తహశీల్దార్ కోరాడ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు.

రోడ్డు పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో జోన్ పరిధి చిల్లపేట జంక్షన్ నుంచి బొగ్గు రోడ్డు వరకు రూ.75 లక్షలతో నిర్మించనున్న తారు రోడ్డు పునర్నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధాన, శివారు ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి, విస్తరణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. అభివృద్ధి, సంక్షేమానికి తొలి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, జివిఎంసి కో-ఆప్షన్ సభ్యులు కొప్పల ప్రభావతి, వైసిపి నాయకులు కొప్పల కృష్ణ, చినబాబు, జీరు సుజాత తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కేంద్ర కారాగారానికి మందులు అందజేత


మందులు అందజేస్తున్న యంగ్ ఇండియన్స్ ప్రతినిధులు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్రకారాగారంలో ఖైదీలకు అవసరమయ్యే మందులను యంగ్ ఇండియన్స్ ప్రతినిధులు అందజేశారు. రూ.2.5 లక్షల విలువ చేసే మందులను యంగ్ ఇండియన్ చైర్‌పర్సన్ రాయ్ కొడాలి, హెల్త్ ప్రతినిధులు డాక్టర్ శ్రావణి సంధ్య గురువారం కేంద్రకారాగారం పర్యవేక్షణాధికారి ఎస్.రాహుల్ కలిసి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో వైజాగ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ వైస్ చైర్మన్ ఒ.నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న నిర్వాహకులు

విద్యార్థులకు వేసవి శిక్షణ

ప్రజాశక్తి -కంచరపాలెం : వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యాన బిఎన్ఆర్ ఫౌండేషన్ భవనంలో కంచరపాలెం ప్రాంత విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. విజ్ఞానంతో కూడిన వినోదాత్మక అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరాన్ని ఈ ప్రాంతవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరానికి రావాల్సిన వారు 8500267726 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



గడపగడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న కెకె.రాజు తదితరులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి- కంచరపాలెం : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు తెలిపారు. జివిఎంసి 49వ వార్డు పరిధి బర్మా క్యాంప్ కాలనీ, పిఆర్.గార్డెన్, మాణిక్యాంబ కాలనీ, చాకలిగెడ్డ ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావుతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ప్రజల సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు, చివరి లబ్ధిదారుని వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరాలనే ఉద్దేశంతో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ.రవికుమార్, రాయుడు శ్రీను, నూకరాజు, ఢిల్లీరావు, రాము, సరస్వతమ్మ, పావని, రాంబాబు, ఏసు, ఆచారి, మున్నా, సుబ్బలక్ష్మి, మస్తాన్, దేవుడు, హైమ, షేక్ బాజ్జీ, కె.చిన్న, వసంతల అప్పారావు, సబ్బవరపు శీను, గురువోజీ, కరి రామారెడ్డి, జక్కంపూడి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణం తొలగింపు

ప్రజాశక్తి-సీతమ్మధార : జీవీఎంసీ జోన్ 3 పరిధి నక్కవానిపాలెం 60 అడుగుల రోడ్డులో అనధికారికంగా నిర్మించిన మూడో అంతస్తును తొలగించినట్లు టిపిఎస్ తేజ తెలిపారు. ఎసిపి వెంకటేశ్వర్లు ఆదేశాలు మేరకు అనధికారిక నిర్మాణాలను తొలగిస్తున్నట్లు చెప్పారు.



క్రీడాకారులతో మజ్జి సోమేష్ తదితరులు

సామాజిక సేవ అంటే మక్కువ : మజ్జి

ప్రజాశక్తి -ములగాడ : సామాజిక సేవ అంటే తనకు ఇష్టమని 61వ వార్డు టిడిపి అధ్యక్షుడు మజ్జి సోమేష్ చెప్పారు. శ్రీహరిపురం ఎంఐజి క్వార్టర్స్ మైదానంలో మైక్ టైసన్ బాక్సింగ్ సమ్మర్ కోచింగ్ క్యాంపులో శిక్షణ పొందిన క్రీడాకారులకు మజ్జి సోమేష్ సౌజన్యంతో గురువారం గుడ్లు, అరటి పళ్ళు, బిస్కెట్లు, మజ్జిగ, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ షైక్ అలీ, గణేష్, హరి, నవీన్, ప్రీమ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

వన్‌స్టాప్ డెస్టినేషన్‌గా పోర్టు స్టేడియం

స్పోర్ట్స్, ఫన్, అడ్వెంచర్స్ పార్క్‌గా రూపకల్పన

ప్రజాశక్తి-సీతమ్మధార : ఇంతవరకు క్రీడా మైదానంగానే ఉన్న పోర్టు స్టేడియాన్ని విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకులు స్పోర్ట్స్, ఫన్, అమ్యూజిమెంట్ అడ్వెంచర్స్ పార్క్‌గా తీర్చిదిద్దుతున్నారు. ఒకవైపు అనేక క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ కోచ్‌లతో శిక్షణ శిబిరాలను నిర్వహిస్తూనే మరోవైపు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునేలా ఒక టూరిస్ట్ స్పాట్‌గా స్టేడియంలో సర్వ హంగులు అద్దుతున్నారు.

పిల్లలకు వేసవి సెలవులు రావడంతో వారిని ఉత్సాహపరిచేలా క్రీడా ఔత్సాహికుల కోసం అడ్వెంచర్స్ పార్క్, వాటర్ పార్క్, పిల్లల ఎంటర్‌టైన్‌మెంట్‌కు ట్రాపోలిన్ పార్క్, విశాఖలో హిమపాతం అనుభూతిని కలిగించేలా స్నూన్ వరల్డ్, అద్భుత ప్రపంచాన్ని కళ్ళముందే సాక్షాత్కరించేలా వర్చువల్ గేమింగ్ జోన్, క్రికెట్ నుంచి అర్చరీ వరకు అన్ని రకాల అవుట్ డోర్, ఇండోర్ క్రీడలకు సంబంధించిన వేదికలను రూపొందిస్తున్నారు. స్విమ్మింగ్ పూల్, జాగింగ్ ట్రాక్, ఇండోర్, అవుట్ డోర్ జిమ్స్, సాంస్కృతిక ప్రదర్శనలకు వేదికగా యాంపీ థియేటర్, ఆటలు, పాటలు, క్రీడలు, విద్య, సాహసం, వినోదం, విహారం అన్నిటికీ వన్‌స్టాప్ డెస్టినేషన్‌గా పోర్టు స్టేడియం రూపుదిద్దుకుంటోంది

భారీ సమ్మర్ క్యాంప్

విశాఖలోని అతిపెద్ద సమ్మర్ క్యాంప్ నిర్వహణకు విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ స్వీకారం చుట్టింది. మునుపెన్నడూ ఎవ్వరూ చేయని విధంగా దేశంలో ప్రముఖ స్పోర్ట్స్ అకాడమీ సహకారంతో ఒకేసారి 30కి పైగా క్రీడ, విద్య, వినోదానికి సంబంధించిన అంశాలపై ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తోంది. మే 1వ తేదీ నుంచి ఆరు వారాల పాటు ఇండోర్, అవుట్ డోర్ క్రీడలతో ప్రత్యేక స్పోర్ట్స్ పాఠ్య ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ శిబిరంలో క్రికెట్ నుంచి కర్రసాము వరకు, టెన్నిస్ నుంచి కుకింగ్ వరకు, డాకచన్స్ నుంచి డెబిట్స్ వరకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చేలా ప్రణాళికను రూపుదిద్దారు. ఇండోర్, అవుట్ డోర్ గేమ్‌లో జాతీయ స్థాయి కోర్టులతో క్యాంపులో చేరిన వారికి శిక్షణ ఇవ్వనుంది. ఈ వేసవిలో సమయాన్ని వృథా చేయకుండా పిల్లలలో క్రీడలపై మక్కువ పెంచడంతోపాటు క్రీడా నైపుణ్యాన్ని మరింత పదును పెట్టడానికి ఈ శిక్షణ శిబిరం దోహదపడనుంది. క్రీడలతో పాటు విద్య, వైజ్ఞానిక అంశాలపై కూడా శిక్షణ ఇవ్వడంతో విద్యార్థులకు మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. ఆసక్తి ఉన్నవారు ఒక్కొక్కరు ఒక్కో పూల్‌లో రెండు అంశాలు నేర్చుకునే అవకాశం ఉంది. వారానికి రూ.500 చొప్పున రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 7 గంటల వరకు



విద్యార్థులకు పలు సూచనలిస్తున్న నిర్వాహకులు



వివిధ క్రీడాంశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

అభ్యర్థులకు అనువైన బ్యాచ్‌లో చేరే అవకాశం ఉంది.

క్రీడా మైదానంతో అమ్యూజ్‌మెంట్ సెంటర్‌గా...

పోర్టు స్టేడియాన్ని క్రీడామైదానంగానే కాకుండా విశాఖలో సరికొత్త అమ్యూజ్‌మెంట్ హబ్‌గా విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారుచేసే విధంగా అంతర్జాతీయ స్థాయి క్రీడా వే ది క ల ను సి ద్ధం



క్యాచ్‌లు ప్రాక్టీసు చేస్తున్న విద్యార్థులు

చేస్తోంది. క్రికెట్‌తో పాటు 8 బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, 4 వాలీబాల్ కోర్టులను అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దుతోంది. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కోచ్‌లను తీసుకొచ్చి వివిధ క్రీడల్లో శిక్షణ ఇచ్చేందుకు సమాయత్తమవుతుంది. నగర నడిబొడ్డున ఉన్న ఈ పోర్టు స్టేడియాన్ని ఒక క్రీడా వేదికగా కాకుండా అన్ని వయసుల వారికి అనువైన ఆరోగ్యం, విహారం, వినోదం పంచేలా అమ్యూజ్‌మెంట్ హబ్‌గా రూపుదిద్దుతున్నారు.

ఆరు నెలల్లో పూర్తిస్థాయిలో

ఆరు నెలల్లో స్టేడియం పూర్తిస్థాయి స్పోర్ట్స్ అండ్ అమ్యూజ్‌మెంట్ సెంటర్‌గా మారనుంది. పిల్లల కోసం రాంపోలిన్ పార్క్, మౌంటెన్ క్లింబింగ్, స్విమ్మింగ్ పూల్, స్నో వరల్డ్ బాక్స్, క్రికెట్ తదితరాలు త్వరలోనే అందరినీ అలరించనున్నాయి. వాకర్స్ కోసం జాగింగ్ ట్రాక్‌తో పాటు అవుట్ డోర్, ఇండోర్ జిమ్స్ ఏర్పాటు చేస్తున్నారు. వివిధ కళాకారుల ప్రదర్శనలకు అణువుగా యాంఫీ థియేటర్ అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ప్రస్తుతం ఉన్న కళావాణి ఆడిటోరియాన్ని మరింత ఆధునికీకరించనున్నారు.

పూల్ వారీగా ఉండే క్రీడాంశాలు

పూలే ఎ : అవుట్ డోర్ క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, హాకీ, ఫుట్‌బాల్, ఆర్థ్లెటిక్స్, ఖోఖో, కబడ్డీ, బాస్కెట్ బాల్, ఆర్చరీ పూల్ ఎలో ఉంటాయి.

పూల్ బి: ఇండోర్ టేబుల్ టెన్నిస్, చెస్, కార్త్రెరత్ ఫెయిల్, షూటింగ్స్, తైక్వాండో, కర్రసాము, ఫెన్సింగ్ ఉంటాయి.

పూల్ సి: ఆర్ట్స్ అండ్ కల్చర్, డాన్స్, మ్యూజిక్, సింగింగ్, యాక్టింగ్, యోగా, పెయింటింగ్, కుకింగ్ పూల్ సిలో ఉంటాయి.

పూల్ డి: ఎడ్యుకేషన్ అండ్ సైన్స్ పరిశోధనలు, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ప్రోత్సాహం, భారత చరిత్ర, రోబోటిక్స్, ట్రెజర్, గార్డెనింగ్, డెబిట్ అండ్ గ్రూప్ డిస్కషన్ ఉంటాయి.

అన్ని వయసుల వారికీ ఆహ్లాదం

పోర్టు స్టేయాన్ని బెస్ట్ డెస్టినేషన్ ఫర్ స్పోర్ట్స్ అండ్ అమ్యూజ్‌మెంట్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేశాం. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో క్రీడా వేదికలే కాకుండా అన్ని వయసులో వారిని అలరించే వినోదాన్ని, ఆహ్లాదాన్ని పంచే పూర్తిస్థాయి ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్‌గా త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తాం. ఇప్పటికే జాతీయ కోచ్‌ల పర్యవేక్షణలో మే 1వ తేదీ నుంచి భారీ సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నాం. ఇప్పటికే చాలామంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. మరో ఆరు నెలల్లో స్పోర్ట్స్ ఫన్ యాక్టివిటీస్ అందరినీ అలరిస్తాయి



బొడ్డేటి నరేంద్ర
విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్
మేనేజింగ్ డైరెక్టర్

జిఒ 7 అమలుకు ధర్నా

ప్రజాశక్తి-సీతమ్మధార : జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఉత్తర్వులు, జిఒ 7 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరుతూ జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన అక్కయ్యపాలెంలోని లేబర్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం లేబర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ, జిఒ 7 ప్రకారం రూ.18.500 వేతనాన్ని జివిఎంసి, క్లాప్ కాంట్రాకర్ చెల్లించడంలేదని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కాంట్రాక్టర్లకు లైసెన్సులు, రికార్డులు లేని కారణంగా వారిపై ప్రాసిక్యూషన్ చర్యలకు నోటీసులిస్తానని, సమాన వేతన చట్టం ప్రకారం క్లైమ్‌లు వేసుకుంటే ఆర్డర్ ఇస్తానని లేబర్ కమిషనర్ హామీ ఇచ్చారని వెంకటరెడ్డి తెలిపారు. పి.అనీల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు, నాయుడు, సీర రమణ, పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న వెంకటరెడ్డి తదితరులు

పారిశుధ్య కార్మికులకు హెల్త్ కిట్లు

ప్రజాశక్తి-గాజువాక : జివిఎంసి 65వ వార్డు పరిధి రాజీవ్ ఇండోర్ స్టేడియం ఆవరణలోని బాపూజీ కాలనీ సచివాలయం వద్ద గురువారం పారిశుధ్య కార్మికులకు హెల్త్ కిట్లను కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విధి నిర్వహణతో పాటు ఆరోగ్య పరిరక్షణ విషయంలో కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కార్మికులకు సూచించారు. పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని ప్రశంసించారు. కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని కొబ్బరినూనె, వర్క్ జాకెట్స్, ఇతర వస్తువులను జివిఎంసి అందజేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు సూర్య ప్రకాష్, అప్పలరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలని

జివిఎంసి క్లాప్ డ్రైవర్ల ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి

జీవీఎంసీలో పనిచేస్తున్న క్లాప్ డ్రైవర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో గురువారం జీవీఎంసీ క్లాప్ వాహనాల యార్డు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు, సిపిఎం మండల కన్వీనర్ గంట శ్రీరామ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులందరినీ ఆప్కాస్‌లో చేరుస్తామని హామీ ఇచ్చిందని, నేడు స్వచ్ఛభారత్ క్లాప్ డ్రైవర్లుగా ఉన్నవారిని థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ ఇచ్చి శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. క్లాప్ డ్రైవర్లందరినీ ఆప్కాస్‌లో కలపాలని, పిఎఫ్, ఈఎస్ఐ సమస్యల పరిష్కరించాలని, జీవో నెంబర్ 7ను, హెల్త్ అలవెన్స్‌లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో క్లాప్ వాహనాలన్నీ ఒకే వ్యక్తికి రాష్ట్ర ప్రభుత్వం కట్టబెట్టి కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడుతుందని విమర్శించారు. క్లాప్ డ్రైవర్లకు కనీస వేతనం రూ.18,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం అమలు చేయకపోతే ఈనెల 15 తర్వాత సమ్మెకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం క్లాప్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు ఏజెశివకుమార్, పి.సతీష్ కుమార్, కె.దుర్గారావు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న క్లాప్ డ్రైవర్లు



దిలీప్‌కుమార్‌కు కేక్ తినిపిస్తున్న మంత్రి

ఘనంగా దిలీప్ కుమార్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ జన్మదిన వేడుకలు తుమ్మపాల గ్రామపంచాయతీలో గురువారం ఘనంగా జరిగాయి. రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్ దిలీప్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి సాలువ, పూలదండలతో సత్కరించారు. అనంతరం దిలీప్ కుమార్ జల్ జీవన్ మిషన్ ఇంటింటి కుళాయిల పనులను తుమ్మపాల గవర వీధి కొణతాల దిబ్బ వద్ద ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గొర్లె సూరిబాబు, వైసిపి నాయకులు పలక రవి, మళ్ల బుల్లి బాబు, మందపాటి జానకిరామరాజు, జాజుల రమేష్, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి చంద్రశేఖర్, సర్పంచ్ తట్టా పెంటయ్య నాయుడు, ఎంపీటీసీలు పంచదార్ల కన్నారావు, అశోక్, పన్నీర్ వెంకటలక్ష్మి చంటి, చదరం చిన్న, దంతులూరి కళ్యాణ్ చక్రవర్తి, పీలా విశ్వేశ్వరరావు, బొడ్డపాటి రామ్ కుమార్, పీలా బుజ్జి, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



పింఛన్లు అందజేస్తున్న డిప్యూటీ సిఎం బూడి

అభయహస్తం పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : వైఎస్ఆర్ ఇందిరా క్రాంతి పథం ద్వారా మండలంలో 343 పెన్షన్లు మంజూరు కాగా, గురువారం రైవాడ అతిథి గృహం వద్ద 51 మంది వృద్ధులకు అభయహస్తం పింఛన్లను ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ సింహాచలం నాయుడు, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, మండల జెసిఎస్ కన్వీనర్ కెవి రమణ, గొల్లపల్లి మురళి, ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, ఐకెపి ఎపిఎం ఎస్.ప్రభాకర్, ఐకెపి సీసీలు, వివోఏలు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-కె.కోటపాడు : జనసేన పార్టీ మాడుగుల నియోజకవర్గం నాయకులు, రాయపురెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకులు రాయపురెడ్డి కృష్ణ తన సొంత నిధులతో స్థానిక షిరిడి సాయిబాబా మందిరంలో గురువారం పేదలకు, సాయి భక్తులకు అన్న సమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో కుంచా అంజిబాబు, ముమ్మిన సతీషు, ఇస్మార్ట్ శంకర్, హరీష్, చుక్క నారాయణమూర్తి గంగునాయుడు, శ్రీను, కోనేటి రాజు, కొచ్చెర్ల వరహాలు, సాయి భక్త సేవకుడు యాళ్ళ సాయి పాల్గొన్నారు.

ఎపిజివిబి సేవలపై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఖాతా దారులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు మేనేజర్ కుప్పిలి వెంకట శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సీతానగరం గ్రామంలో గురువారం ప్రజలకు బ్యాంకు సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిపాజిట్ల పై ఇతర జాతీయ బ్యాంక్‌ల కన్నా తమ బ్యాంక్ అధిక వడ్డీ చెల్లిస్తుందని చెప్పారు. మహిళ, వ్యవసాయ, గృహ, వాహన, చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధికి బంగారు ఆభరణాలపై గ్రాముకు రూ.4,150 చొప్పున రుణ సదుపాయం ఇసున్నట్లు తెలిపారు. పంట రుణాల సకాలంలో చెల్లిస్తే ప్రభుత్వ రాయితీ పొందవచ్చన్నారు. 1బి ఫారం సమర్పించి పంట రుణం తీసుకోవచ్చన్నారు. ఆరోగ్య బీమాతో పాటు అన్ని రకముల బీమా సౌకర్యం కల్పిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ మోటమర్రి శ్రీనివాసరావు, సర్పంచ్ సుంకరి చంటి, గ్రామస్తులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న బ్యాంకు అధికారులు

సిపిఎస్‌ను రద్దు చేయాల్సిందే

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబ్బాయి

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రతిపక్ష నేతగా ఎన్నికలు, పాదయాత్ర సమయాల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సిపిఎస్‌ను తక్షణమే రద్దు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి డిమాండ్ చేశారు. ఉద్యోగులకు భద్రతనిచ్చే పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం జరిగిన యుటిఎఫ్ జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇప్పటికే సిపిఎస్‌ను రద్దు చేసి, ఒపిఎస్‌ను పునరుద్ధరించే దిశగా అడుగులు వేస్తున్నారని, జగన్ కూడా వెంటనే సిపిఎస్‌ను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలుగా ఎన్నికైన వారికి పెన్షన్ పథకం వర్తిస్తున్నప్పుడు, ఉద్యోగులకు పెన్షన్ లేకపోవడం అన్యాయమన్నారు. పిఎఫ్ ఆర్‌డిఎ బిల్ పార్లమెంటులో పాస్ కాకముందే 2003 డిఎస్‌సి ఉపాధ్యాయుల నోటిఫికేషన్ విడుదల అయినందున, వారిని పాత పెన్షన్ పథకం కిందకు తీసుకురావాలని కోరారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు డిఎ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. పాత పిఆర్‌సి కాలవ్యవధి జులై నెలతో ముగియనున్నందున, 12వ పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు నెల్లి సుబ్బారావు, అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, కోశాధికారి జోగా రాజేష్, జిల్లా కార్యదర్శులు వి.రమేష్ రావు, వి.చైతన్యషీలా, శేషుకుమార్, రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు చిన్నబ్బాయి

వర్షాలకు దెబ్బతిన్న జగనన్న కాలనీ పునాదులు



పునాదుల బీమ్ కింద మట్టి కొట్టుకుపోయిన దృశ్యం

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని పైడివాడ అగ్రహారంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న అర్బన్ హౌసింగ్ కాలనీలో ఇళ్ల పునాదులు బుధవారం కురిసన వర్షానికి దెబ్బతిన్నాయి. ఈ జగనన్న అర్బన్ హౌసింగ్ కాలనీ నిర్మాణానికి 2022 ఏప్రిల్ 28న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అర్బన్ లబ్ధిదారులకు 323.31 ఎకరాల్లో సుమారు 10,223 ఇళ్లను ఇక్కడ నిర్మిస్తున్నారు. అయితే ఇక్కడ లే అవుట్ కొండవాగు, గెడ్డ వాగులో ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంతంలో నిర్మాణం చేస్తున్న ఇళ్ల పునాదులు వరద నీటికి దెబ్బతిన్నాయి. కాలనీ చుట్టూ నీరు పోవడానికి భారీ కాలువలు ఏర్పాటు చేయాల్సి ఉంది. పల్లపు ప్రాంతంలో ఎత్తయిన రోడ్లు నిర్మిస్తే ఈ సమస్యలు తలెత్తవు. కాని ఆ పనులేవీ చేయకపోవడంతో అర్బన్ హౌసింగ్ కాలనీ లబ్ధిదారులు భయాందోళనలు చెందుతున్నారు. ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేయడంతో తమ సొంతింటి కలను సాకారం అవుతుందని ఆశపడ్డ లబ్ధిదారులకు చుక్కెదురైనట్లు అవుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఎస్‌పి మురళీకృష్ణకు ప్రజాసంఘాల అభినందనలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా నూతన ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన కెవి.మురళీకృష్ణను ఆయన కార్యాలయంలో గురువారం ప్రజా సంఘాల ఐక్యవేదిక సభ్యులు కలసి పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు డాక్టర్ చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, బండి అప్పారావు, వాసుపల్లి తాతయ్యలు, బొబ్బిలి గోవిందరాజు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న పైలా ప్రసాదరావు

శ్రీకృష్ణ ఆలయ అభివృద్ధికి పైలా విరాళం

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని గొండుపాలెం గ్రామంలో గురువారం శ్రీకృష్ణుడి ఆలయం ప్రారంభోత్సవానికి టిడిపి మాడుగుల నియోజకవర్గం నాయకులు పైలా ప్రసాదరావు హాజరై పూజలు నిర్వహించారు. ఆలయం అభివృద్ధికి రూ.10 వేలు విరాళాన్ని యాదవ సంఘానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బండారు దేముడుబాబు, బండారు మత్స్యపాత్రుడు, కూండ్రపు అప్పారావు, గజ్జి దేముడుబాబు, సీమసిరి ముసిలినాయుడు, కోట ముత్యాలు, ఒమ్మి దేముడుబాబు, కోట అప్పలనాయుడు, గజ్జి శ్రీను, బోర కన్నబాబు, యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి 82వ వార్డు గాంధీనగర్ ఇన్‌కామ్ టాక్స్ వీధిలో ఉన్న బ్రైట్ స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యాలయంలో సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత వేసవి శిక్షణ కార్యక్రమాలను ఆ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి లక్ష్యంగా నిరుద్యోగ యువత, మహిళలకు బ్రైట్ సంస్థ పలు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జానకిరామరాజు మాట్లాడుతూ సంస్థకు ప్రభుత్వ పరంగా సహకారాన్ని అందజేయడానికి కృషి చేస్తామన్నారు. వారు కోరిన విధంగా సొంత భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించే అంశాన్ని మంత్రి గుడివాడ అమర్నాథ్ కృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఎస్‌బిఐ అనకాపల్లి ప్రధాన శాఖ చీఫ్ మేనేజర్ లక్ష్మీపతి మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి అవసరమైన సహకారాన్ని అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కాళ్ల శివశంకర్, కార్యదర్శి తాటిపూడి జయశ్రీ, గాంధీనగరం అభివృద్ధి కమిటీ సభ్యులు కొండూరు రవీంద్రనాథ్, బిఎల్ఎన్ శర్మ, సంస్థ ప్రతినిధులు, శిక్షణకు హాజరైన అభ్యర్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ మందపాటి సునీత



ప్రజలకు దండాలు పెడుతున్న మంత్రి అమర్‌నాథ్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-కశింకోట

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ అన్నారు. మండలంలోని తేగాడ గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న మంత్రి అమర్నాథ్ గ్రామంలో జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటి కుళాయిల ఏర్పాటు పనులను ప్రారంభించారు. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.15 లక్షలతో మురికి కాలువల నిర్మాణం, రూ.20 లక్షలతో దత్తాత్రేయ గుడి దగ్గర నుండి ఎస్సీ కాలనీ వరకు సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కలగాల లక్ష్మి, సర్పంచ్‌లు కలగా గున్నయ నాయుడు, నీటిపల్లి రాజేశ్వరి, ఎంపిటిసి తుంపాల వెంకట సత్యనారాయణ (రాజు), మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, డైరెక్టర్ నీటిపల్లి లక్ష్మి, ఆర్ఇసిఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, వైసిపి నాయకులు నీటిపల్లి దివాకర్, ఎంపీడీవో కొంకి అప్పారావు పాల్గొన్నారు.

ప్రజలను మోసగించడంలో జగన్ దిట్ట

ప్రజాశక్తి-అనకాపల్లి :

ముఖ్యమంత్రి జగన్ రెడ్డి అమాయకమైన ముఖం పెట్టి అబద్ధాలు ప్రచారం చేయడంలో, ప్రజలను మోసగించడంలో దిట్ట అని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగజగదీశ్వరరావు ఆరోపించారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నందున గతంలో చేసిన శంకుస్థాపనలకు తిరిగి శంకుస్థాపనలు చేయడం జగన్ రెడ్డికే చెల్లిందన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా ఒకలాగా, అధికారం ఉన్నప్పుడు ఒకలాగా మాట్లాడటం జగన్ నైజమని పేర్కొన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణానికి నిర్ణయం తీసుకుంటే, అయ్యన్నపాత్రుడు, గంట శ్రీనివాసరావు, అవంతి శ్రీనివాస్‌కు లబ్ధి చేకూర్చడం కోసమే అని విమర్శించిన జగన్ రెడ్డి ఇప్పుడు అక్కడే ఎందుకు కడుతున్నారని ప్రశ్నించారు. అన్నపూర్ణగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు హబ్‌గా మార్చేశారని విమర్శించారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ నాయుడు, మాడుగుల, చోడవరం ఇన్‌ఛార్జులు పివిజి.కుమార్, బత్తుల తాతయ్య బాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు రాక జగన్ పాలనలో నిరుద్యోగం సమస్య పెరిగిపోయిందన్నారు. సమావేశంలో చోడవరం సుగర్స్ మాజీ చైర్మన్ గూనూరు మల్లు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లను అడ్డుకోండి : సిపిఎం

ప్రజాశక్తి-దేవరాపల్లి

వ్యవసాయ పంపుసెట్లకు రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని రైతులు కలిసి కట్టుగా అడ్డుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న పిలుపునిచ్చారు గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లను బిగించేందుకు వైసిపి ప్రభుత్వం సిద్ధమైందని తెలిపారు. బిల్లుల చెల్లింపును తొలుత రైతులే భరించాలని, ఆ తర్వాత బిల్లుల మొత్తాన్ని నగదు బదిలీ పథకం కింద రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని ప్రభుత్వం చెబుతుందని పేర్కొన్నారు. ఒక వైపు ఉచిత విద్యుత్ అంటూనే మరో వైపు బిల్లుల రూపంలో రైతుల పీకపై కత్తి పెడుతుందన్నారు. ఏపీ హరిత బంధన కార్పొరేషన్ ద్వారా ప్రతి నెలా వచ్చే బిల్లును తామే చెల్లిస్తామని ప్రభుత్వం చెబుతున్నా, విద్యుత్తు పంపిణీ సంస్థలకే సబ్సిడీ డబ్బులు సకాలంలో చెల్లించడం లేదని, అలాంటిది రైతుల ఖాతాల్లో వేస్తుందన్న గ్యారెంటీ ఏమిటని ప్రశ్నించారు. వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ప్రారంభించిన ఈ పథకం 19 ఏళ్లగా సాఫీగా సాగుతోందని, ఇప్పుడు ఆయన వారసుడు జగన్మోహన్‌రెడ్డి దానికి తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. తక్షణమే స్మార్ట్ మీటర్ల బిగింపును ఆపాలని డిమాండ్ చేశారు.

మామూళ్ల మత్తులో సిహెచ్‌సి?

- వైద్యుడు రూ.5వేలు డిమాండ్ చేసినట్లు రోగి బంధువుల ఆరోపణ
- గతంలోనూ అనేక ఆరోపణలు
- ఎమ్మెల్యే హెచ్చరించినా తీరు మారని వైనం

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్

పేదలకు ప్రభుత్వ ఆసుపత్రులే పెద్ద దిక్కు. డబ్బులు పెట్టి ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకొనే ఆర్థిక స్థోమత లేని వీరు తమకు ఏ రోగమొచ్చినా, ఏ విధమైన అనారోగ్యానికి గురైనా వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రులకే వస్తారు. అటువంటి పేదలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన వైద్యం అందడం లేదు. ప్రధానంగా కొన్ని రకాల ఆపరేషన్లకు వైద్యులు డబ్బులు డిమాండ్ చేయడం, తమ ప్రైవేటు క్లినిక్‌లకు రమ్మని ఆదేశించడం చేస్తున్నారు. యలమంచిలి సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇటువంటి సంఘటనే చోటుచేసుకుంది.

రోగి బంధువులు తెలియజేసిన వివరాలు ప్రకారం... యలమంచిలి మున్సిపాలిటీ 21వ వార్డు పెద గొల్లలపాలెం గ్రామానికి చెందిన కుంద్ర దినేష్ (13) ఏప్రిల్ 28న తమ పొలంలోకి వెళుతూ కాలువ గట్టు దాటుతుండగా పడిపోవడంతో చెయ్యి విరిగింది. దీంతో దినేష్‌ను చికిత్స నిమిత్తం యలమంచిలి సామాజిక ఆరోగ్య కేంద్రం (సిహెచ్‌సి)కి తల్లిదండ్రులు తీసుకెళ్లగా పిండి కట్టు వేశారు. ఆపరేషన్ చేయాల్సి ఉండగా, ఆసుపత్రిలో చేరి నాలుగు రోజులైనా ఆర్థోపెడిక్ డాక్టర్ దయాకర్ ఆపరేషన్ చేయకపోవడంతో బంధువులు ప్రశ్నించారు. ఆపరేషన్‌కు రూ.5వేలు ఖర్చవుతుందని ఆర్థోపెడిక్ డాక్టర్ చెప్పారు. తమది నిరుపేద కుటుంబం కావడంతో డబ్బులు ఇవ్వలేమని, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్యం చేయాలని కోరారు. యలమంచిలి సిహెచ్‌సిలో ఆపరేషన్‌కు కావాల్సిన పరికరాలు లేవని చెప్పి విశాఖ కెజిహెచ్‌కు రిఫర్ చేశారు. దీంతో చేసేది ఏమీ లేక తల్లిదండ్రులు దినేష్‌ను విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందించారు.

డబ్బులు ఇవ్వలేదని ఆపరేషన్ నిరాకరించారు : రోగి బంధువు

ఈ సందర్భంగా రోగి బంధువు పి.రాజబాబు మాట్లాడుతూ ఆర్థోపెడిక్ డాక్టర్ దయాకర్ రూ.5వేలు లంచం అడిగారని, తాము ఆ డబ్బులు ఇవ్వలేమని చెప్పడం వల్లే ఆపరేషన్ చేయడానికి ఆయన నిరాకరించారని ఆరోపించారు. ఒకవేళ నిజంగా ఆపరేషన్‌కు అవసరమైన పరికరాలు లేకపోతే జాయిన్ అయిన రెండో రోజే కేజీహెచ్‌కు రిఫర్ చేయాల్సి ఉండగా, ఆసుపత్రిలో ఐదు రోజుల పాటు ఎందుకు ఉంచారని ప్రశ్నించారు.

గతంలోనూ ఆరోపణలు

యలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులపై గతంలోనూ కొన్ని ఆరోపణలు ఉన్నాయి. ఆర్థోపెడిక్ డాక్టర్‌కు ఎలమంచిలి ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గరలో సొంత క్లినిక్ ఉందని, ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగులకు తన సొంత క్లినిక్‌కు రమ్మని ఆదేశాలు ఇస్తున్నట్లు గతంలో ఆరోపణలు వినబడ్డాయి. ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డబ్బులు వసూలు చేస్తున్నారని గతంలో వచ్చిన ఆరోపణలు నేపథ్యంలో ఎమ్మెల్యే కన్నబాబురాజు నెల రోజుల క్రితం డాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఇలాంటి ఆరోపణలు మళ్లీ వస్తే సస్పెండ్ చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. ఇది జరిగి నెలరోజులు కాకముందే మళ్లీ లంచం డిమాండ్ ఆరోపణలు రావడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు దీనిపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



గాయపడిన బాలుడికి పిండికట్టు కట్టిన దృశ్యం

సాదాసీదాగా మండల పరిషత్తు సమావేశం



మాట్లాడుతున్న ఎంపిపి జన్మోహన్

ప్రజాశక్తి- కె.కోటపాడు

కె.కోటపాడు మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం సాదాసీదాగా జరిగింది. ఎంపిపి రెడ్డి జన్మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అధికారులు తాము ఇంతవరకు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేశారు. అనకాపల్లి ఫారెస్ట్ అధికారి మాట్లాడుతూ రైతులకు సరుగుడు, టేకు మొక్కలు ఉచితంగా జులై నెలలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇంటి పెరట్లో పెంచుకోవడానికి జామ, దానిమ్మ, బత్తాయి మొక్కలు సరఫరా చేస్తామన్నారు. తహశీల్దారు ఆర్.రమేష్‌బాబు మాట్లాడుతూ ఇప్పటికే భూముల రీ సర్వే ప్రక్రియ వేగవంతంగా సాగుతుందని, మొదటి విడతలో ఏడు గ్రామాలు పూర్తి చేశామని చెప్పారు. రెండో విడతలో 15 గ్రామాల్లో చేస్తున్నామని, మూడో విడతలో 10 గ్రామాలు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. సర్వే పూర్తయిన చోట భూ హక్కు పత్రాలు రైతులకు అందజేయనున్నట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి అల్లు శ్వేత మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా 21 పనులకు గాను రూ.82.82 లక్షలు నిధులు మంజూరయ్యాయని, ఇప్పటికే 5 పనులు పూర్తి చేశామని చెప్పారు. గ్రామాలలో తాగునీటికి ఎటువంటి ఇబ్బంది లేకుండా పంచాయతీ నిధులతో మరమ్మతులు చేపట్టాలని సర్పంచులను కోరారు. ఇఒపిఆర్‌డి ప్రసాద మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛ సంకల్ప కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పారిశుధ్య పనులు ప్రణాళికాబద్ధంగా జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాండ్రేగుల శశిదేవి, సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

చేపల వేటలో మత్స్యకారులు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : తుపాన్లు, అల్పపీడనాలు, పెనుగాలుల సందర్భాల్లో సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మత్స్యశాఖ అధికారి లక్ష్మణరావు కోరారు. జూన్ 15వ తేదీ నుంచి సముద్రంలో చేపల వేట పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో మత్స్యకారులు తీసుకోవలసిన జాగ్రత్తలపై ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రకృతి వైపరీత్యాలపై మీడియా అందించే సమాచారం తెలుసుకొని గ్రామాల్లో దండోరా వేయించి చేపల వేట నిలుపుదల చేయాలన్నారు. వేట పరికరాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, సముద్రపు వేటలో ఉన్నవారు తక్షణమే ఒడ్డుకు చేరుకోవాలని సూచించారు. అవసరమైనప్పుడు రెస్క్యూ టీంకు సహకరించాలని కోరారు. చేపల వేటకు వెళ్లేటప్పుడు బోటు, ఇంజన్, తెరచాప పరిస్థితులను గమనించాలని, లైఫ్ జాకెట్లు, సెల్ ఫోన్ చార్జర్లు, టార్చ్ లైట్, ఫస్ట్ ఎయిడ్ కిట్లు బోట్లో ఉంచుకోవాలని సూచించారు. వేటకు వెళ్లే సమయంలో వారి సమాచారాన్ని సచివాలయ సిబ్బందికి తెలియజేయడంతో పాటు ప్రమాదంలో ఉంటే కోస్టల్ సెక్యూరిటీ పోలీస్, ఇండియన్ కోస్ట్ గార్డు, మత్స్య శాఖ అధికారులకు తెలియజేయాలని కోరారు.

కమీషన్లకు కక్కుర్తిపడి ఆసుపత్రి నిర్వీర్యం

ప్రజాశక్తి-అనకాపల్లి : కమీషన్లకు కక్కుర్తిపడి ఎంపీ, మంత్రి స్థానిక ఎన్టీఆర్ ఆసుపత్రిని నిర్వీర్యం చేశారనిమాజీ ఎమ్మెల్యే పీల గోవింద సత్యనారాయణ ఆరోపించారు. సెల్ఫీ ఛాలెంజ్‌లో భాగంగా గురువారం ఆయన ఎన్టీఆర్ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి కమీషన్ల కోసం ప్రైవేట్ అంబులెన్సులతో కుమ్మక్కయ్యారని తెలిపారు. మంత్రి గుడివాడ అమర్నాథ్ ప్రైవేట్ స్కానింగ్ సెంటర్ల కోసమే ఎన్‌టిఆర్ ఆసుపత్రిని నిర్వీర్యం చేశారని ఆరోపించారు. మంత్రి గుడివాడకు చేతకాకపోతే సొంత డబ్బులతో సిటీ స్కాన్ మరమ్మతులు చేస్తామని సవాల్ విసిరారు.

శివయ్య సేవలు మరువలేనివి

ప్రజాశక్తి- అనకాపల్లి : పేద ప్రజల పట్ల సామాజిక బాధ్యతతో వ్యవహరించి వారికి న్యాయం కల్పించడంలో సామాజిక న్యాయవాది సి.శివయ్య సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. శివయ్య జయంతి వేడుకలు అడ్వకేట్ కానిశెట్టి సురేష్ బాబు కార్యాలయంలో గురువారం నిర్వహించారు. శివయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు సాయి లక్ష్మణ్, మాజీ అధ్యక్షులు అడపా సుధాకర్, కార్యదర్శి సూర శ్రీనివాసరావు, శివయ్య జూనియర్స్ పాల్గొన్నారు.



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సుందరపు విజయ్‌కుమార్

ఉత్సాహంగా క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-రాంబిల్లి

మండలంలోని వాడ రాంబిల్లి గ్రామంలో శ్రీదుర్గమ్మ అమ్మవారి పండగ మహోత్సవం సందర్భంగా జనసేన పార్టీ ఆధ్వర్యాన గురువారం ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆ పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి సుందరపు విజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల అధ్యక్షులు పప్పల నూకన్నదొర, బయలపూడి శ్రీరామదాసు, నాయకులు నాగరాజు, నర్సింగరావు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -దేవరాపల్లి : అతివేగం ప్రమాదకరం, మద్యం తాగి వాహనం నడపవద్దు, ద్విచక్రవాహనం దారులు హెల్మెట్ ధరించాలి, తలా మీదే రక్షణ మీదే అన్న నినాదాలతో ప్రజలకు అవగాహన కల్పిస్తూ గురువారం ర్యాలీ నిర్వహించారు. వైయస్సార్ ఇందిర క్రాంతి పథం (ఐకెపి) ఆధ్వర్యంలో జరిగిన అవగాహన ర్యాలీలో తహశీల్దార్ ఎం. లక్ష్మి, ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి పాల్గొని రోడ్డు భద్రత, జాగ్రత్తలపై వివరించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి పలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఐకెపి ఏపిఎం ఎస్. ప్రభాకర్, సీసీ గుణేశ్వరరావు, విఓఎలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : తాకాశి ఉమామహేశ్వరరావు (బాబు) ద్వితీయ వర్థంతి సందర్భంగా ఆయన కుమారులు తాకాశి కన్నబాబు(చిన్ని) ఆధ్వర్యాన తాకాశి వీధి చిన నూకాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద గురువారం 300 మంది పేదలకు చీరలు పంపిణీ చేశారు. 500 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. వైసిపి పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు, యువజన అధ్యక్షుడు జాజుల రమేష్, నాయకుడు కోరుకొండ రాఘవ వీటిని అందజేశారు. బొండా శంకరరావు ఆధ్వర్యాన గాంధీనగర్ శ్రీ సత్యసాయి బాబా మందిరంలో తాకాశి బాబు జ్ఞాపకార్థం పేదలకు భోజనాలు, చీరలు, తువ్వాళ్ళు, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో కారుకుండి కన్నబాబు, తాకాశి సత్యందొర, బేతి ఈశ్వరరావు, పలకా చంటి, ఉగ్గిన అప్పారావు, తాకాశి కిషోర్, తాకాశి విస్సు, మోహన్, దోసపత్రి సోములు, యర్రా ఈశ్వరరావు, బుగతా అశోక్, మేడిశెట్టి గణేష్ పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్'కు తరలిరండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాగరాజు

ప్రజాశక్తి-గొలుగొండ : తెలుగు రాష్ట్రాల్లో బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యంగా బిఎస్‌పి ఆధ్వర్యంలో నిర్వహించే చలో హైదరాబాద్ రాజ్యాధికార సభకు నర్సీపట్నం నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని నియోజకవర్గ బిఎస్‌పి ఇన్‌ఛార్జి బొట్టా నాగరాజు పిలుపునిచ్చారు. గురవారం చలో హైదరాబాద్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ నాలుగుసార్లు యుపి ముఖ్యమంత్రిగా పనిచేసిన మాయావతి ముఖ్యఅతిథిగా హాజరువుతున్న ఈ రాజ్యాధికార సభలో రానున్న ఎన్నికల్లో తెలుగు రాష్ట్రాల్లో అధికారం చేజిక్కించుకోవడానికి పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేయనుండడంతో ఈ సభకు ఎంతో రాజకీయ ప్రాధాన్యత ఉందన్నారు. బిఎస్‌పి గొలుగొండ మండల అధ్యక్షులు కుందేటి పట్టాలు, బొట్ట పాప, కూరాకుల నాయుడు, మెలిపాక శివ పాల్గొన్నారు.

చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి



సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటను చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని ఎంపిడిఒ సీతారామరాజు సూచించారు. గురువారం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. చెత్త నిర్వహణను పక్కగా అమలు చేయాలన్నారు. వర్మీ కంపోస్టుతో ఆదాయం సమకూర్చుకోవాలని సూచించారు. పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీను తదితరులు పాల్గొన్నారు

జాబ్ కార్డుదారులందరికీ ఉపాధి పని కల్పించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి : జాబ్ కార్డు దారులకు ఉపాధిపని కల్పించాలని ఎంపిడిఒ సీతారామరాజు సూచించారు. గురువారం మండలంలో రాజయ్యపేట గ్రామంలో ఉపాధి హామీ పథకం మేట్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ. కార్డుదారులంతా ప్రతిరోజూ ఉపాధి పనికి వచ్చేలా చూడాలన్నారు..ప్రతి ఒక్కరికి రోజుకు రూ.272 వేతనం వచ్చేలా చూడాలన్నారు. ఎపిఒ ఈశ్వరరావు ,పంచాయతీ కార్యదర్శులు శ్రీను, రాజశేఖర్, ఇసి, విఆర్‌పిలు పాల్గొన్నారు,



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

దుర్గంధభరిత వ్యర్థాలతో అవస్థలు

పట్టించుకోని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలోని పలు గ్రామాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాలలోని మాంసం దుకాణాల నుంచి సేకరించిన వ్యర్థాలతో రోడ్డుపైనే వెళుతున్న వాహనంతో నానా అవస్థలు పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. దుర్గంధభరిత వ్యర్థాలతో వెళుతున్న వాహనం ఎక్కడ ఆగినా, దాని వెనుక ప్రయాణం సాగించినా ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని పలువురు వాహనదారులు అంటున్నారు. ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా గ్రామగ్రామాన చికెన్ దుకాణాల నుండి వ్యర్థాలను డ్రమ్ముల్లో సేకరించి వాహనాల్లో తీసుకెళుతుండగా, వాటి నుంచి వెలువడే దుర్వాసనతో ఇబ్బందులే కాకుండా, ఆ వాహనం వెళుతున్న సందర్భంలో పక్కగాగానీ, వెనుకనగానీ, ఇతర వాహనాల్లో వెళితే దుర్గంధపూరిత కలుషిత నీరు వెదజల్లబడి ఇబ్బందులు పడుతున్నారు. అనేక గ్రామాలను దాటుతూ చేపల చెరువులకు తీసుకెళ్లే ఈ వ్యర్థాల వ్యాన్‌తో ఇబ్బందులు పడుతున్నా, అటు అధికారులుగానీ, పోలీసులుగానీ పట్టించుకోవడం లేదని పలువురు అంటున్నారు. ఆయా వ్యర్థాలను చేపల చెరువుల వద్దకు తీసుకెళ్లి, వాటిని మేతగా వేయడం వల్ల ఆ చెరువుల్లోని నీరు కలుషితమౌతోందని, దాన్ని కిందకు వదిలేస్తుండడంతో ఆ ప్రాంతంలోని భూగర్భ జలాలన్నీ కాలుష్యకారకమై అనారోగ్య సమస్యలు ఉత్పన్నమౌతున్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీనిపై తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



వ్యర్థాలను సేకరిస్తున్న వాహనదారులు

ఉపాధి కూలీలకు కనీస వేతనం ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎంపిడిఒ చంద్రశేఖర్

ప్రజాశక్తి -కోటవురట్ల : జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టిలకు ఉపాధి పని కల్పించడంతోపాటు వారికి రోజుకు రూ.272 కనీస కూలి గిట్టుబాటు అయ్యేలా చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ చంద్రశేఖర్ సూచించారు.

గురువారం మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పని ప్రదేశంలో నిబంధనల మేరకు సౌకర్యాలు కల్పించాలన్నారు, గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టి తగు చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు అన్ని వసతులు కల్పించి, ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన చేపట్టి పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు.

ఎస్‌డిజి సర్వే శతశాతం పూర్తి చేయాలని, కల్యాణమస్తు దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు, సచివాలయ సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండిసేవలు అందించాలని సూచించారు, కార్యక్రమంలో గహ నిర్మాణ శాఖ ఇంజనీరు జగదీశ్వరరావు, ఇఒపిఆర్‌డి ప్రేమ్‌సాగర్, ఎపిఒ గంగునాయుడు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


ఉపాధి నిధులతో మట్టి రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని పాకలపాడు పంచాయతీ శివారు గ్రామం వెంకట్రాపురం గ్రామం నుంచి పిఎన్‌డిపాలెం, పెసరాడ, దిబ్బలూరు, అప్పన్నపాలెం, కంఠవరం, పప్పుశెట్టిపాలెం మెయిన్ రోడ్డు వరకు మట్టి రోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. జెడ్‌పిటిసి సుర్ల గిరిబాబు కృషితో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ సహకారంతో ఆయా గ్రామాలకు లింకు తారురోడ్డు మంజూరౌతున్న నేపథ్యంలో ముందుగా ఉపాధి హామీ పథకం నిధులతో రోడ్డు ఇరువైపులా తుప్పల తొలగిస్తూ, రెండువైపులా మట్టికాలువలు తీయడం, రోడ్డు చదును చేయడం వంటి పనులు చేపట్టనున్నారు కార్యక్రమంలో సర్పంచ్ బిడిజాన రాజేశ్వరి, మాజీ సర్పంచ్ పత్తి రమణ, ఉపాధి హామీ విఆర్‌పి కె.రాజేశ్వరి పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న నేతలు

మాదిగల సంక్షేమానికి సహకరించాలి



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను కలిసిన తుమ్మల

ప్రజాశక్తి -పాయకరావుపేట : మాదిగల సమస్యలపై శానసమండలిలో ప్రస్తావించి, వాటి పరిష్కారానికి కృషి చేయడం ద్వారా మాదిగల అభివృద్ధికి సహకరించాలని నూతనంగా ఎన్నికైన అంబేద్కర్ కోనసీమ జిల్లా వాసి ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ను అనకాపల్లి జిల్లా ఎంఆర్పిఎస్ కార్యవర్గ సభ్యులు తుమ్మలపల్లి కుమార్ బుధవారం ఈ మేరకు కుమార్ మాట్లాడుతూ మాదిగ మరియు ఉప కులాల అభివద్ధి కొరకు మందకష్ణ మాదిగ చేపట్టిన ఉద్యమం 28 సంవత్సరాలు గడుస్తుందని ఆ విషయంపై శాసనసభ మండలంలో గళం వినిపించాలని అఖిలపక్షాన్ని ఢిల్లీకి పంపించే విధంగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ కు ఆర్థిక శుభాకాంక్షలు తెలియజేసి నాయకులు తుమ్మలపల్లి కుమార్ కోరినట్లు ఈ సందర్భంగా తెలియజేశారు.

వైభవంగా ముత్యాలమ్మ పండగ

ప్రజాశక్తి - రావికమతం: మండలంలో గుమ్మాలపాడు గ్రామదేవత ముత్యాలమ్మ పండగ గురువారం ఘనంగా వైభవంగా నిర్వహించారు. పండుగ సందర్శంగా విద్యుద్దీపాల ంకరణలతో గ్రామం వెలిగిపోతుండగా, ప్రజల వినోదానికి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. వేకువజామునుంచే అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు వివిధపార్టీల రాజకీయ నేతలు ముత్యాలమ్మను దర్శించుకుని పూజలు చేశారు.భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, సర్పంచ్, ఎంపిటిసి, గ్రామపెద్దలు, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

ఘనంగా మరిడితల్లి మహోత్సవం



పూలతో అందంగా అలంకరించిన ఆలయం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని బలిఘట్టం గ్రామంలో మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవం సందర్భంగా ఆలయాన్ని పూలతో, విద్యుద్దీపాలతో అలంకరించారు. వేకువజాము నుంచే అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు, పూజలు చేశారు.

మున్సిపాలిటీ పరిధిలో మరిడమ్మ ఉత్సవాలను నర్సీపట్నం, పెద్దబొడ్డేపల్లి, బలిఘట్టం వాసులు వంతులవారీగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది బలిఘట్టం వాసుల వంతు రావడంతో పట్టణంలో సందడి నెలకొంది. ఒక్కో ప్రాంతంలో మూడేళ్లకోసారి పండగ నిర్వహణకు అవకాశం ఇవ్వడంతో బలిఘట్టం వాసులు పోటాపోటీగా ఏర్పాట్లు చేశారు. బాణసంచా, డప్పులు, కోలాటాలు, డ్యాన్స్‌లతో సందడి నెలకొంది. బలిఘట్టంలోని ఇళ్లన్నీ బంధుమిత్రులతో కిటకిటలాడాయి.

వ్యాన్‌లో తరలిస్తున్న ఆవులు పట్టివేత



పోలీసులు పట్టుకున్న గోవులు

ప్రజాశక్తి-రోలుగుంట : పాడేరు నుంచి తునికి బొలెరో పికప్ వ్యాన్‌లో 15 మూగజీవులను రోలుగుంట పోలీస్ స్టేషన్ సమీపంలో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు అడుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కబేళాలకు వీటిని తరలిస్తున్నారని, అడ్డుకుని, మూగజీవులను రక్షించాలని కోరుతూ ముందుగానే ఎస్‌ఐ నాగకార్తీక్ సమాచారమివ్వడంతోపాటు వాటిని పట్టుకునేలా చర్యలు చేపట్టారు. మూగ జీవులను తరలిస్తున్న యజమానులపై కఠిన చర్యలు తీసుకొని కేసు నమోదు చేయాలని రమేష్, ఈశ్వరరావు డిమాండ్ చేశారు.

ఏజెన్సీ డిప్యూటీ డిఇఒగా చెల్లయ్య

ప్రజాశక్తి - హుకుంపేట: జిల్లాల పునర్విభజన తర్వాత కొత్తగా ఏర్పడిన అల్లూరి జిల్లాకు మొట్టమొదటి ఏజెన్సీ డిప్యూటీ డిఇఒగా హుకుంపేట మండలం, రాప పంచాయతీ గొందిరాప గ్రామానికి చెందిన రేగం చెల్లయ్య నియమితులయ్యారు. ముంచంగిపుట్టు మండల విద్యాశాఖాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న చెల్లయ్యకు, ఏజెన్సీ డిప్యూటీ డిఇఒగా నియమించారు. సామాన్య కుటుంబంలో పుట్టి అంచెలంచెలుగా ఎదిగి, ఉన్నతస్థాయికి చేరుకున్న చెల్లయ్యను తోటి ఉపాధ్యాయులు, పలువురు నేతలు అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా చెల్లయ్య మాట్లాడుతూ, ఏజెన్సీలో విద్యావ్యవస్థను పటిష్టం చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

వేసవి శిక్షణను పరిశీలించిన డిఎస్‌పి



క్రీడాకారుల విన్యాసాలు చూస్తున్న డిఎస్‌పి ప్రవీణ్

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : స్థానిక ఎన్‌టిఆర్ మినీ స్టేడియంలో నింజాస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను డిఎస్‌పి ప్రవీణ్ కుమార్ గురువారం సందర్శించారు. బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థుల విన్యాసాలను తిలకించి మురిసిపోయారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో శారీరక దృఢత్వంతోపాటు విద్య, ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. పట్టణ సిఐ గణేష్ స్పోర్ట్స్‌కోటాలోనే ఉద్యోగం సంపాదించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో నింజాస్ అకాడమీ ఛైర్మన్ వెలగానారాయణరావు, కార్యదర్శి వి.జగన్నాథం, డైరెక్టర్స్ బోళెం శివ, కోచ్‌లు శేఖర్, వీరబాబు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్ సూర్యకుమారి

ప్రజాశక్తి - రావికమతం : మండలంలో కవగుంట గ్రామంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి పనులు చేయిస్తున్నట్లు సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు తెలిపారు. గురువారం గ్రామంలో రొబ్బా భగవంతుల దొర ఇంటి నుంచి సారిక వెంకటరమణ ఇంటి వరకు ఉన్న డ్రైనేజీలో పూడికతీత పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తూ చేయించారు. గ్రామంలో జ్వరాలు, ఇతరత్రా అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే, పరిశుభ్రత ఎంతో అవసరమని, అందుకే పారిశుధ్య పనులు చేయిస్తున్నామని, దోమల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. అన్ని వీధుల్లోనూ పనులు చేయిస్తామని, అయితే పంచాయతీలో సరిపడా నిధులు లేనందున ప్రభుత్వపరంగా మంజూరు చేరాలని సూర్యకుమారి కోరారు.

భూహక్కు పత్రాల పంపిణీ



ఇకెవైసి తీసుకుంటున్న రెవెన్యూ సిబ్బంది

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో సమగ్ర భూ రీసర్వే పూర్తయిన ఆరు గ్రామాలలో భూ హక్కు పత్రాలు పంపిణీ చేపడుతున్నారు, ఇందులో భాగంగా గురువారం అన్నవరం గ్రామంలో రైతులకు గ్రామ రెవెన్యూ అధికారి ఆశారత్నం, గ్రామ సర్వేయర్ పద్మ భూ హక్కుప త్రాలను అందజేశారు. రైతుల నుంచి ఇకెవైసి తీసుకుని పత్రాలను అందజేస్తున్నారు, అన్నవరం, ఎండపల్లి, సుంకపూరు, జల్లూరు, రాజుపేట, రామన్నపాలెం ఆరు గ్రామాలకు సంబంధించి 2916 మంది రైతులకు భూహక్కు పత్రాలను అందజేసేందుకు అధికారులు సిద్ధం చేశారు.

మండల సభలో సమస్యల ఏకరువు!

నర్సీపట్నం మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో సభ్యులు పలు సమస్యలపై ఏకరువు పెట్టారు. గురవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి సుర్ల రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేములపూడి ఎంపిటిసి బోలెం రాంప్రసాద్ మాట్లాడుతూ తన సెగ్మెంట్ పరిధిలోని మూడు గ్రామాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆగిపోవడంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంగన్వాడీ పోస్టుల భర్తీలో ఐసిడిఎస్ అధికారులు రిజర్వేషన్లకు తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. రేషన్ కార్డులు, పింఛన్లు, డ్రైనేజీలు,త ఆగునీరు ఇతరత్రా సమస్యలు తిష్ట వేసి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ కార్డుల సమస్యలపై తహశీల్దార్ వాసు వివరణనిచ్చారు.

ఇందిరా కూరగాయల మార్కెట్లో షాపులు కేటాయింపు మార్గదర్శకంగా ఇవ్వలేదని, బినామీలు పాగా వేశారని వాటిని సరిచేయాలని కొందరు ఎంపిటిసిలు నిలదీశారు. దీనిపై ఎంపిడిఒ జయమాధవి స్పందిస్తూ, సమస్యలపై అవగాహన లేకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని, జెడ్‌పిటిసి సుకల రమణమ్మ మాట్లాడుతూ 150 పడకల ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు సరిగా అందడం లేదని, ఇంత పెద్దాసుపత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరగకపోవడం శోచనీయమన్నారు. రీసర్వేలో గ్రామ సరిహద్దులను గుర్తించడంలో అధికారులు విఫలమయ్యారని ఒఎల్ పురం సర్పంచ్ బంటు నాగేశ్వరరావు అధికారులను నిలదీయగా, సభలోని ఎంపిటిసిలు, సర్పంచులు మద్దతు తెలిపారు దీనిపై రెవెన్యూ అధికారులు స్పందిస్తూ త్వరలో సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ఎంపిపి సుర్ల రాజేశ్వరి మాట్లాడుతూ జల జీవన్‌మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందించే చర్యలు చేపడుతున్నామన్నారు. పంటకాలువల పూడికతీత, అభివృద్ధికి ఉపాధి హామీ నిధులు మంజూరయ్యాయన్నారు. సమావేశంలో వైస్ ఎంపిపిలు ఇన్నం రత్నం రమణ, కూండ్రపు తాతబాబు. పరిపాలనాధికారి రమణబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి



సమస్యలపై ప్రశ్నిస్తున్న ఎంపిటిసిలు, సర్పంచ్‌లు

రోడ్డు విస్తరణపై నిర్వాసితులకు అవగాహన



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ కనకారావు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : పట్టణ ప్రణాళిక, అభివృద్ధిలో భాగంగా నర్సీపట్నంలో అబీద్ సెంటర్ నుంచి పెద్దబొడ్డేపల్లి వరకు చేపట్టే వంద అడుగుల రోడ్డు విస్తరణకు అందరూ సహకరించాలని తమరాన అప్పలనాయుడు కోరారు. గురువారం రోడ్డు విస్తరణలో ఇళ్లు, దుకాణాలు కోల్పోతున్న భవన యజమానులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ,డివిజన్ కేంద్రంలో ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని, ఎమ్మెల్యే గణేష్ కృషి మేరకు నిధులు మంజూరుకాగా, సిఎం జగన్ వచ్చి పనులకు శంకుస్థాపన చేశారన్నారు. రోడ్డు విస్తరణ వెడల్పు వంద అడుగుల నుంచి తగ్గేదిలేదని, పనులకు అందరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అందరికీ టిడిఆర్ బాండ్లు ఇస్తారని, నగదు ఇచ్చే పరిస్థితి లేదని స్పష్టం చేశారు

మున్సిపల్ కమిషనర్ కనకారావు మాట్లాడుతూ ప్రభుత్వం పారదర్శకంగానే రోడ్డు విస్తరణ పనులు చేపడుతోందని, పట్టణ ప్రణాళిక అభివృద్ధి ప్రతిపాదనల మేరకు విస్తరణ వెడల్పు వంద అడుగులే ఉంటుందని, తగ్గబోదన్నారు. గతంలో కొంతమంది కోర్టులో కేసులు వేసారని, ప్రభుత్వ నిబంధనల మేరకు పట్టణ అభివృద్ధికి సహకరించాలన్నారు. నిర్వాసితుల సందేహాల నివృతికి మరోమారు సమావేశం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైసిపి నేతలు కౌన్సిలర్ కోనేటి రామకృష్ణ, కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, బోడపాటి సుబ్బలక్ష్మి, టౌన్ ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ డిఇ నారాయణ, భవన యజమానులు పాల్గొన్నారు.



హాజరైన భవన, దుకాణ యజమానులు, వ్యాపారస్తులు

ప్రతి కుటుంబానికీ సంక్షేమం

గడపగడపలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



సంక్షేమ పథకాలపై వివరిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

ప్రజాశక్తి - రావికమతం: రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ ఏదోఒక సంక్షేమ పథకాన్ని అందించిన ఘనత సిఎం జగన్మోహనరెడ్డికే దక్కుతుదంని చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. గురువారం మండలంలో తట్టబందలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాలు అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో ప్రభుత్వం ఇచ్చిన పథకాలతో కూడిన బుక్‌లెట్‌ను ఇంటింటా అందించారు. విపక్షాలు చెబుతున్న మాయమాటలు, ఆరోపణలను పక్కనబెట్టి, ప్రజల కోసం పనిచేసే జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి పైలా రాజు, వైసిపి మండల కన్వీనర్ జగన్నాథరావు, మాజీ సర్పంచ్ నరసింహులు, ఎంపిటిసి శేషుబాబు పాల్గొన్నారు

రోడ్డు విస్తరణ పనులకు ముమ్మర సర్వే

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం కొత్తకోట గ్రామంలో రోడ్డు విస్తరణకు గురువారం నుంచి సర్వే పనులు ప్రారంభమయ్యాయి. ఇరుకు రోడ్డుతో తరచూ ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడేవారంతా, రోడ్డు విస్తరణ చేపడుతుందడడంతో ఉలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నర్సీపట్నం- భీముని పట్నం రహదారిలో అన్ని గ్రామాల్లో 15 ఏళ్ల క్రితమే 70 అడుగుల మేర రహదారి విస్తరణ పనులు జరిగాయి. అయితే కొత్తకోటలో మాత్రం ఆగిపోయింది. దీంతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రెండు బస్సులు, లేదా భారీ వాహనాలు ఎదురెదురుగా వస్తే ఇక్కడ తప్పించకోవడం కూడా ఇబ్బందిగా మారింది.

ఈ నేపథ్యంలో చోడవరం మండలం గంధవరం నుంచి రోలుగుంట మండలం. వెలంకాయపాలెం వరకూ రహదారి విస్తరణకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ప్రతిపాదనలు మేరకు న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు నుంచి ప్రభుత్వం రూ.104 కోట్లు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఆరు నెలలుగా జాప్యం అవుతున్న పనులు, గురువారం ప్రారంభం అయ్యాయి. గ్రామంలో ఆర్‌అండ్‌బికి ఉన్న స్థలం 66 అడుగుల మేర విస్తరణకు గురువారం సర్వే పనులు ప్రారంభమయ్యాయి. విఆర్ఒ లక్ష్మి, లైసెన్స్ సర్వేయర్ శ్రీరామ్మూర్తి. విలేజ్ సర్వేయర్ శ్రీను, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి : లైంగిక వేధింపులకు గురై, దేశరాజధానిలో రోజుల తరబడి ఆందోళన చేస్తున్న మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ మహిళా రెజ్లర్లపై రెజ్లర్ల అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారని వీడియో, ఆడియో ఆధారాలను చూపిస్తూ ఫిర్యాదు చేసి, తమకు న్యాయం చేయాలని రెజ్లర్లు అందోళన చేస్తున్నా కేంద్రప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. క్రీడలతో దేశప్రతిష్టను పెంచేందుకు కృషి చేస్తున్న ఆటగాళ్లపై ఇటువంటి వేధింపులు దుర్మార్గమని, బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం మరింత అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బ్రిజ్ భూషణ్ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.